ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్, నవంబర్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందించడం జరుగుతున్నదని, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని ఆరెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రిటైర్డు ఉపాధ్యాయురాలు, సామాజిక సేవకురాలు సంధ్యావళి విద్యార్థులకు అందించిన షూను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా దక్పథంతో సంధ్యావళి మేడం విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మండల విద్యాధికారి బండారి మనీల, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, ఎం శ్రీనివాస్, హెచ్ఎం తిరుపతి, సత్యసాయి భక్తులు కాపర్తి జయ, శ్యామల, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంకల్పదీక్షను విజయవంతం చేయాలి

కొమురవెల్లి, నవంబర్ 22 : చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ సంకల్పదీక్షను విజయవంతం చేయాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు చెరుకు రమణారెడ్డి కోరారు. శుక్రవారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈ నెల 30వ తేదీన సంకల్పదీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ సాధించే వరకూ విడుతల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మద్దూరులో ..

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్22: చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం చేర్యాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో జేఏసీ మండల కన్వీనర్ రామడుగు బాలరాజు ఆధ్వర్యంలో సంకల్ప దీక్ష కరపత్రాన్ని జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం రాజకీయాలకతీతంగా కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మద్దూరు, ధూళిమిట్ట మండల అధ్యక్షులు మేక మల్లేశం, కోల సాయిలు, మండల కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శౌకత్‌అలీ, మండల కో-కన్వీనర్లు మోకు ఉదయ్‌రెడ్డి, పాకాల ఇసాక్, యూత్ నాయకుడు పిడిశెట్టి రాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మహేశ్

కొమురవెల్లి, నవంబర్ 22 : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన చుంచు రాజు, తురాయి వెంకటలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందగా వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చదరపల్లి నర్సింగరావు, జంగిలి నవీన్, చుంచు నర్సింహులు పాల్గొన్నారు.

పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

సిద్దిపేట టౌన్,నవంబర్ 22 : పోలీసులు అకింత భావంతో విధులు నిర్వర్తించాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి, నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు.స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి..నమోదవుతున్న కేసుల వివరాలు, పోలీసుల పనితీరు,నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సీఐ వాసుదేవరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు.సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.గంజాయి,మత్తు పదార్థాల రవాణాపై నిఘా ఉంచాలన్నారు. అంతకు ముందు ఏసీపీ మధు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.కార్యక్రమంలో ఎస్సైలు కనకయ్య,కొమురయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

రాయపోల్: దొమ్మట రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సాయికిరణ్

రాయపోల్,నవంబర్ 22 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని దౌల్తాబాద్ మండల వ్యవసాయాధికారి సాయికిరణ్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలంలోని దొమ్మట క్లస్టర్ పరిధిలోని రైతులకు రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగు,యాజమాన్య పద్ధతులు,ఉద్యానవన శాఖ ద్వారా అందించే రాయితీపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికరఆదాయం పెరుగుతుందన్నారు. ఉద్యానవన శాఖ అధికారి రమేశ్ మాట్లాడుతూ మొదటి మూడేండ్ల వరకు అంతర పంటల ద్వారా రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో సంతోష్,ఆయిల్‌ఫెడ్ క్షేత్రస్థాయి అధికారి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో

చిన్నకోడూర్, నవంబర్ 22: ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందవచ్చనని ఏడీఏ పద్మ అన్నారు. చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేండ్లు కష్టపడితే 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పంటకు చీడ, పీడలు చాలా తక్కువగా ఆశిస్తాయన్నారు. ఉద్యాన అధికారి బాలాజీ, మండల వ్యవసాయాధికారి జయంత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అర్చన, రైతులు పాల్గొన్నారు.

నల్లాలకు మోటర్లు బిగిస్తే కఠిన చర్యలు

నల్లాలకు పెట్టిన మోటర్లను తొలిగింపజేస్తున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

సిద్దిపేట, నవంబర్ 22: పట్టణంలోని మిషన్ భగీరథ నల్లాలకు ఎవరైనా మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఆశిత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, కార్మికుల హాజరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. కాల్వల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలిగించాలన్నారు. పట్టణంలోని మహాదేవ దవాఖానలో చెత్తను వేరుచేసి ఇస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. 19వ వార్డులో వాటర్ ట్యాంకుల నిర్వహణను పరిశీలించారు. 17వ వార్డులో నల్లాలకు మోటర్లు బిగించి ఉండడం గమనించి వెంటనే తొలిగింపజేశారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఏఈ పృథ్వీని ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 22 : కొండపాకలో ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ బాక్సింగ్ పోటీలో కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బంగారు పథకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం కుకునూరుపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి వారిని అభినందించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థుల ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలోమండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్తయ్య, ఫిజికల్ డైరెక్టర్ క్యాతం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

త్వరగా వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేస్తాం



సిద్దిపేట ఇండోర్ స్టేడియంలో క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, నవంబర్ 22: త్వరగా వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఆచార్య జయశంకర్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు కోసం వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం ఫుట్‌బాల్ స్టేడియం, బాస్కెట్‌బాల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించి క్రీడా సౌకర్యాలు చాలా బాగా ఉన్నాయని, అధికారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాలీబాల్ స్పోర్ట్స్ అకాడమీ 20 మంది బాలురు, 20 మంది బాలికలతో మంజూరు కాగా, వారికి వేర్వేరుగా కోచింగ్‌తో పాటు భోజన వసతులు ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ అందుబాటులో ఉన్న భవనాల్లో టాయిలెట్స్‌కు మరమ్మతు చేయించాలన్నారు. అవసరమైన వసతులు కల్పించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేవిధంగా శిక్షణ ఇప్పించాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి జయదేవ్ ఆర్యను కలెక్టర్ ఆదేశించారు.

సౌకర్యాలు కల్పిస్తాం

సిద్దిపేట టౌన్,నవంబర్ 22 : ఓయూ పీజీ కళాశాలలో అవసరమైన సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మనుచౌదరి స్పష్టం చేశారు. సిద్దిపేట ఓయూ పీజీ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల కంప్యూటర్ ల్యాబ్ లేడీస్, మెన్స్ హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసీఏ,ఎంసీజే తరగతులకు కావాల్సిన కంప్యూటర్లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్,మెస్ నిర్వహణకు వంట పాత్రలు, ప్లేట్లు,గ్లాసులు అందజేస్తామన్నారు. స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్‌తో మెస్ సౌకర్యానికి ప్రత్యేకంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ రవినాథ్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో జయదేవ్ ఆర్యా,అధ్యాపకులు ఉన్నారు.

తల్లిదండ్రులు, భగవంతుడిని ఆరాధించాలి

మిరుదొడ్డి సదానంద ఆశ్రమంలో పూజలు చేస్తున్న రాంపూర్ కోటిలింగాల పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి

మిరుదొడ్డి, నవంబర్ 22 : గ్రామాల్లోని ప్రజలు తల్లిదండ్రులు, భగవంతుడిని ఆరాధిస్తే సకల సౌభాగ్యాలు, పుణ్యఫలాలు కలుగుతాయని రాంపూర్ కోటి లింగాల పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి టౌన్ శివారులోని సదానంద సరస్వతీ స్వామి ఆశ్రమం 41వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ధ్వజస్తంభాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అనంతరం రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి భక్తులకు సందేశమిచ్చారు.ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. చిన్నారులను ప్రేమించడం, తల్లిదండ్రులను గౌరవించడం దైవంతో సమానమన్నారు. కార్యక్రమంలో పురోహితుడు రాజ పున్నయ్య శర్మ, సదానంద సరస్వతీస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకునేది లేదు

మిరుదొడ్డి, నవంబర్ 22 : కేంద్రం ఎస్సీలను రెండు వర్గాలుగా విడదీసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1000 కిలో మీటర్ల పాదయాత్రలో భాగంగా శుక్రవారం మిరుదొడ్డి మండలంలోని ధర్మారం మీదుగా మాలల మహా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ఎస్సీ వర్గీకరణను ఒప్పుకునేది లేదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో కమిటీ చైర్మన్ ర్యాకం శ్రీరాములు, మాజీ ఎంపీపీ గజ్జల సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, పాద యాత్ర జిల్లా కో-కన్వీనర్ దార ప్వామి, అడ్వకేట్లు ప్రసాద్, నగేశ్, నాయకులు ప్రభాకర్, చంద్రం, రాజేశం, రాజయ్య, శ్రీనివాస్, పరశురాములు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను విజయవంతం చేయాలి

గజ్వేల్, నవంబర్ 22: గజ్వేల్‌లో డిసెంబర్1,2వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు బండ్ల స్వామి కోరారు. శుక్రవారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఏటిగడ్డకిష్టాపూర్‌లో హమాలీ కార్మికుల సమావేశానికి ఆయన హాజరైన సందర్భంగా మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ సీపీఎం అన్నారు. కార్యక్రమంలో వెంకట్ చారి, చంద్రం, లక్ష్మణ్, మహేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు షురూ

హుస్నాబాద్‌టౌన్: గాంధీచౌరస్తాలో కొనసాగుతున్న సుందరీకరణ పనులు

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 22: హుస్నాబాద్ పట్టణానికి కొత్త స్వరూపం తీసుకువచ్చే సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు టీయూఎఫ్ఐడీసీ నుంచి రెండుకోట్లు మంజూరు చేశారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీచౌరస్తా ప్రాంత జంక్షన్ అభివృద్ధి చేసే పనులను శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుతం గాంధీచౌరస్తాలో ఉన్న గాంధీవిగ్రహాన్ని తొలిగించి పనులను చేపట్టారు. గతంలో ఆరుఫీట్లమేర జంక్షన్ ఉండగా తాజాగా ప్రస్తుతం తొమ్మిది ఫీట్ల మేర వెడల్పుచేసి జంక్షన్‌ను అభివృద్ధి చేయనున్నారు. మాధవ కన్‌స్ట్రక్స్ సంస్థ ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని, మూడుమాసాల్లో పనులను పూర్తి చేస్తామని హుస్నాబాద్ మున్సిపల్ ఏఈ పృథ్వీరాజ్ తెలిపారు.

మడేల్ స్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

చేర్యాలలో ప్రారంభమైన మడేల్ స్వామి ప్రతిష్ఠ మహోత్సవ పూజలు

విరాళం అందజేస్తున్న కోఆప్షన్ సభ్యుడు ఖాజా

చేర్యాల, నవంబర్ 22 : పట్టణంలోని చుంచనకోట క్రాసింగ్ వద్ద నూతనంగా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడేల్ స్వామి ఆలయంలో స్వామి వారి ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. వైభవంగా ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రతిష్ఠ ఉత్సవాల్లో మొదటి రోజు వేద పండితులు పూజలను ప్రారంభించారు.స్వామి వారి ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడేల్ స్వామి నిర్మాణం, బోనాల పండుగకు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా శుక్రవారం రూ.5వేల విరాళం అందజేశారు. నాయకులు తుమ్మలపల్లి సంజీవులు, బస్వరాజు యాదగిరి, తుమ్మలపల్లి శ్రీనివాస్, శనిగారి యాదయ్య, తుమ్మలపల్లి కనకయ్య, శ్రీశైలం, చంద్రయ్య పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం వినతి

చేర్యాల, నవంబర్ 22 : అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ సీపీఐ మండలశాఖ ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు,సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, నాయకులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్‌రెడ్డి, మమత, కనకయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల శ్రమదానం

సిద్దిపేట టౌన్,నవంబర్ 22 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్యాడెట్లు శుక్రవారం కళాశాలలో శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేర్ టేకర్ కృష్ణయ్య మాట్లాడుతూ..ఎన్‌సీసీ వార్షికోత్సవంలో భాగంగా శ్రమదానం,రక్తదాన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు శ్రమదానం, మొక్కలు నాటినట్లు తెలిపారు.

పాదయాత్రకు సంఘీభావం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 22 : రాజ్యాంగం హక్కుల పరిరక్షణకు మాలలంతా ఏకం కావాలని జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో పిల్లి సుధాకర్ నేతృత్వంలో జరుగుతున్న పాదయాత్రకు కొమురవెల్లి మండల మాలమాహానాడు నాయకులు సంఘీభావం తెలిపారు. మాలమహానాడు జిల్లా నాయకుడు తలారి కిషన్, కొమురవెల్లి మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మందాల బాబు, సిలువేరు కనకమల్లేశం పాల్గొన్నారు.

అంగడిలో పశువైద్యుడి నియామకంపై హర్షం

పశువైద్యుడితో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్, నవంబర్ 22: హుస్నాబాద్ పట్టణంలో ప్రతి శుక్రవారం జరిగే అంగడిలో పశువైద్యుడిని నియమించి పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడంపై బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అంగడిలో విధులు నిర్వహిస్తున్న పశువైద్యుడితో ఆయన మాట్లాడారు. కొన్నేండ్లుగా ఆరోగ్యంగా ఉన్న పశువులను కూడా పశువధశాలకు అక్రమంగా తరలిస్తున్నారని, పలు మార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన కృషితో అంగడిలో పశువైద్యుడు విధులు నిర్వహిస్తున్నాడన్నారు. పశువైద్యుడి ధ్రువీకరణ అనంతరమే పశు వధశాలకు పశువులను తరలించే అవకాశం ఉంటుందని, దీని వల్ల పశు సంపద తరిగిపోకుండా ఉంటుందన్నారు. ప్రతి అంగడిలో పశువైద్యుడు విధిగా విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, పోలీసులు కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వేల్పుల రాజు, ఎనగందుల శంకర్, మారపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీలు ఎన్నిక

చేర్యాల, నవంబర్ 22 : పట్టణంలోని సుమిత్ర జూనియర్ కళాశాలలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభ జరిగింది.ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా తలారి కనకయ్య, ఉపాధ్యక్షురాలిగా కె.ఉమారాణి, బి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పిల్లి రాజు, కోశాధికారిగా బి.సంపత్, కార్యదర్శులుగా పాక చంద్రమౌళి, ఎ.సుధాకర్, జి.రజిత, కె.కనకారెడ్డి, పర్వీన్‌బేగం, ఎస్.పద్మ, ఎస్‌డబ్ల్యూఫ్ కన్వీనర్‌గా బల్ల పురుషోత్తం, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఆర్.రవీందర్, క్రీడా కమిటీ కన్వీనర్‌గా జి.శ్రీధర్ ఎన్నికయ్యారు. మహాసభలో జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్, బి.సత్యనారాయణ, కాటం శ్రీనివాస్, టి.నర్సింహులు, చంద్రమౌళి, ఉమారాణి, రజిత, పుట్ట మల్లికార్జున్ పాల్గొన్నారు.

మద్దూరులో..

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్22: టీఎస్ యూటీఎఫ్ మద్దూరు మండల నూతన కమిటీని శుక్రవారం జరిగిన మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి కోడిపల్లి ప్రశాంత్‌కుమార్ హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా రంగు రాజమల్లు, ఉపాధ్యక్షులుగా ఎ.లక్ష్మీనర్సయ్య, బి.అనురాధ, ప్రధాన కార్యదర్శిగా కాటం శ్రీనివాస్, కోశాధికారిగా ఎస్. చంద్రయ్య, కార్యదర్శులుగా పి. హన్మారెడ్డి, ఎస్. రాజేశం, టి. నర్సింహులు, జి. అంజనేయులు, కవిత ఎన్నికయ్యారు. బి. సత్యనారాయణ, టి. నర్సింహులు, చంద్రమౌళి, ఉమారాణి, రజిత, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో రాధిక

గజ్వేల్, నవంబర్ 22: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి, ఆయిల్‌పామ్ సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి రాధిక తెలిపారు. శుక్రవారం మండలంలోని అక్కారం రైతువేదికలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అధిక సాంద్రత పద్ధతిలో చీడపీడల యాజమాన్య పద్ధతులు చేపట్టే సస్యరక్షణ చర్యలపై వివరించారు. అధికారులు సూచించిన విధంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడే వచ్చే అవకాశాలు ఉన్నాయని, పంటల సాగు విషయంలో సలహాలు, సూచనలు పాటించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పల్లవి, ఏడీఏ బాబునాయక్, ఏఈవో జ్యోతి, మాజీ సర్పంచ్ బాలచంద్రం పాల్గొన్నారు.

నీలకంఠ సమాజం మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట, నవంబర్ 22: సిద్దిపేట నీలకంఠ సమాజానికి అనుబంధంగా నీలకంఠ సమాజం మహిళా విభాగం ఏర్పాటు చేసినట్లు నీలకంఠ సమాజం అధ్యక్షుడు యోగీశ్వర్, ప్రధాన కార్యదర్శి సురేశ్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని నీలకంఠేశ్వర సమాజ భవనంలో మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా కడవేర్గు భారతి, ప్రధాన కార్యదర్శిగా కాల్వ మాధవి, కోశాధికారిగా వీరబత్తిని సుష్మ, ఉపాధ్యక్షులుగా కాల్వ పద్మ, వీరబత్తి శ్రీలత, సహాయ కార్యదర్శులుగా అప్పయ్యగారి అనిత, మమత, గౌరవ సలహాదారులుగా వీర బత్తిని మంజుల, రాయిని స్వప్న ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు కడవెర్గు శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు

గజ్వేల్ మహాసభను విజయవంతం చేయాలి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 22 : గజ్వేల్ పట్టణంలో రేపు (ఆదివారం) జరిగే డివిజన్ మహాసభకు విజయవంతం చేయాలని యునైటెడ్ ఎల్లక్షిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ టీజీఎస్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు సింగిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటిపల్లి సుధాకర్, డివిజన్ నాయకులు ఆరేపల్లి రమేశ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు

పద్మదల ఆకారంలో దీపారాధన

వర్గల్,నవంబర్ 22: నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న కార్తికమాస దీపారాధనలో భాగంగా శుక్రవారం 21వ రోజు శివాలయం ఎదుట పద్మదల ఆకారంలో ఏర్పాటు చేసిన దీపారాధన భక్తులను ఆకట్టుకున్నది. ఆలయం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, సీనియర అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్,